
మాట్లాడుతున్న గొల్లపల్లి దయానంద్, మహేష్‌యాదవ్ తదితరులు

కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఆరు గ్యారంటీ పథకాలను పటిష్టంగా అమలు చేయడానికి సన్నద్ధమవుతుండగా బీజేపీ, బీఆర్ఎస్ నేతలు లేనిపోని విమర్శలు చేస్తున్నారని, ఇవి మానుకోకపోతే ప్రజలు గుణపాఠం చెబుతారని పలు సంఘాలు, కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భారతీయ కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి దయానంద్, కాంగ్రెస్ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి మన్నె మహేష్‌యాదవ్, దళిత, మైనార్టీ విమోచన సమితి అధ్యక్షుడు మహ్మద్ ఎక్బాల్, మహిళా కాంగ్రెస్ నగర కార్యదర్శి ఓ సుజమ్మ, కాంగ్రెస్ లీగల్ సెల్ కార్యదర్శి ఎం.శ్యామ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆదరణ పొందుతుంటే రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే విమర్శలు చేస్తున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిక స్థానాలు గెలుచుకోవడం గ్యారంటీ అని ధీమా వ్యక్తం చేశారు.


పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

చెత్త తరలింపులో 'రాంకీ' నిర్లక్ష్యం

రాంనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బస్తీలు, కాలనీలలో చెత్త తరలింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాంకీ సంస్థపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీలలో ఆమె పాదయాత్ర నిర్వహించి పారిశుధ్య సమస్యను పరిశీలించారు, చాలా బస్తీలలో చెత్త పేరుకుపోయి ఉండటంతో ఈ విషయంపై జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. మాజీ కార్పొరేటర్ బి వెంకట్‌రెడ్డి, నాయకులు మిర్యాల శ్రీనివాస్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.


డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, ముఠా గోపాల్

దళితుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం

కవాడిగూడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ వారి సంక్షేమానికి షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. దళితుల హక్కుల సాధన కోసం సంస్థ చేసే పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు తెలిపారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్ వద్దగల అంబేడ్కర్ భవన్‌లో తెలంగాణ షెడ్యూల్డుకులాల హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో 2024 డైరీ, క్యాలెండర్‌ను చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్‌వెంకటస్వామి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, తెలంగాణ షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు డి.సుదర్శన్‌బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు డి.సుదర్శన్‌బాబు, అలిండియా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ జాతీయ అధ్యక్షుడు రాగాల నాగేశ్వర్‌రావు, ఎస్.నర్సింగ్‌రావు, దాసరి రవీందర్, రుద్రారం శంకర్, కె.వినోద్‌కమార్, కె చెన్నకేశవరావు, దాసరి యాదగిరి, శంకర్, విజయబాబు, కుర్మ మహేందర్, జీఎస్ వీణ, స్టాలిన్, కృష్ణవేణి, నవీన్, బట్టు కృష్ణ, మల్లేష్ం, తామస్, ఎల్లం కుమార్ పాల్గొన్నారు.

భార్య సెల్‌ఫోన్, మంగళసూత్రంతో భర్త అదృశ్యం


అర్జున్‌రాయ్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పని చేయకుండా జులాయిగా తిరుగుతున్న ఓ భర్త తన భార్య సెల్‌ఫోన్, మంగళ సూత్రం తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్‌లో నివాసముంటున్న అమిత్‌రాయ్ కుమారుడు అర్జున్‌రాయ్(33)కి వి.స్వాతితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. గతంలో అర్జున్‌రాయ్ ప్రింటింగ్ ప్రెస్ ఆపరేటర్‌గా పని చేశాడు. ప్రస్తుతం పని లేకుండా జులాయిగా తిరుగుతున్నాడు. ఏదైనా పని చేయమని ఇంట్లో ఒత్తిడి చేస్తుండడంతో భార్య స్వాతి సెల్‌ఫోన్, మంగళసూత్రం తస్కరించి బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై స్వాతి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

చిక్కడపల్లిలో 500 గ్రాముల గంజాయి స్వాధీనం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గంజాయి సప్లయ్ చేస్తున్నారన్న సమాచారంతో చిక్కడపల్లి పోలీసులు ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య పర్యవేక్షణలో పీ అండ్ టీ కాలనీలో మంగళవారం సాయంత్రం దాడి చేశారు. ఈ దాడిలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులు బాల్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఒమర్(26), అశోక్‌నగర్‌కు చెందిన ఆవుల సాయితరుణ్(31), రామ్‌నగర్‌కు చెందిన దాసరి శ్రీధర్(22)లను అదుపులోకి తీసుకుని వారి ప్రశ్నించారు. వారి నుంచి 500 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

నలుగురు బైక్ దొంగల అరెస్టు

కవాడిగూడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు యువకులను దోమలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీ వివరాలను సీఐ డి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మహ్మద్ సమీర్(20), షేక్‌అల్తాఫ్(20) మహ్మద్ ఓమేద్(42), శేఖర్ చింతకాయల(36) నలుగురు కలిసి దోమలగూడలోని అప్పర్ ట్యాంక్‌బండ్ వద్ద గల ఏజీఎస్ బైక్ సర్వీస్ పాయింట్ గ్యారేజీ తాళాలు పగులగొట్టి బైకులు దొంగిలించారు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఐ ఎం.వరప్రసాద్, క్రైం బృందం ఖలీల్, వంశీ, ఉదయ్‌లు విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నలుగురు నిందితులను పట్టుకొని విచారించారు. దోమలగూడ పీఎస్ పరిధిలో ఐదు బైక్‌లను చోరీ చేసినట్లు అంగీకరించినట్లు ఆయన చెప్పారు. దొంగతనం చేసిన వాహనాల విడి బాగాలను స్క్రాబ్ చేసి అమ్మే వారని, వీటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ నలుగురుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడి పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య వివరాల ప్రకారం.. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని దోమలగూడ పీఎస్ పక్కన వృద్ధుడు(60) అపస్మారకస్థితిలో ఉన్నట్లు మంగళవారం సాయంత్రం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం రావడంతో సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. చికిత్స నిమిత్తం వృద్ధుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు కేసు నమోదు చేసుకున్నారు. అతడు యాచకుడు అయి ఉండొచ్చని పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని పెయింటర్ మృతి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): చెవిలో ఇయర్‌ఫోన్ పెట్టుకుని పాటలు వింటూ పట్టాల మధ్య నడుచుకుంటూ వెళ్తున్న ఓ పెయింటర్‌ను రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ చిన్నయ్యనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ తలాబ్‌కట్టకు చెందిన మహ్మద్ రఫిక్(44) వృత్తిరీత్యా పెయింటర్. బుధవారం ఉప్పుగూడ రైల్వే స్టేషన్ వద్ద చెవిలో ఇయర్‌ఫోన్ పెట్టుకుని పాటలు వింటూ రైలు పట్టాల మధ్యన నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన గూడ్సు రైలు హారన్ కొట్టినా వినిపించకపోవడంతో రైలు ఢీకొట్టింది. దీంతో రఫిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్నట్టు చిన్నయ్యనాయక్ తెలిపారు.

అమ్మ అనే పదంలోనే మాధుర్యం

- ఓయూ హిందీ విభాగం ప్రొఫెసర్ సంగీత
- ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కె.సంగీత

బర్కత్‌పుర, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మమ్మీ అనే ఇంగ్లీష్ పదం కంటే అమ్మ అనే తెలుగు పదంలోనే ఎంతో మాధుర్యం ఉందని ఓయూ హిందీ విభాగం ప్రొ.కె.సంగీత అన్నారు. మాతృభాషను విస్మరించడం అంటే మాతృమూర్తిని మర్చిపోవడమేనని అందరూ మాతృభాషను రక్షించుకోవడానికి కృషి చేయాలని ఆమె కోరారు. బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రొ.సంగీత మాట్లాడుతూ.. ఇతర భాషలను నేర్చుకున్నా.. మాతృభాషకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె కోరారు. ఓయూ తెలుగు విభాగం అధిపతి విశ్రాంత ప్రొ.కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. మాతృభాష, మాతృభూమి, మాతృమూర్తి ఈ మూడు చాలా ముఖ్యమని అన్నారు. మాతృభాషను విస్మరిస్తే భవిష్యత్ తరాలకు ప్రమాదకరమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.వెంకట్రావు, హెచ్‌ఆర్ డైరెక్టర్ డా.జయప్రద, కార్యదర్శి సాయిరామ్, ద్వితీయ భాషాధ్యక్షురాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు అన్ని శాఖల్లో అమలయ్యేలా చూడాలి

రాంనగర్ : తెలుగును అధికారిక భాషగా రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో క్షేత్ర స్థాయిలో అమలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా, ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ నగర కార్యాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్వర్గీయ సీఎం ఎన్టీఆర్ తెలుగుషభాషను ప్రపంచదేశాలకు చాటారని తెలిపారు. తెలుగు సాహితీ వైభవానికి ప్రతిరూపంగా ట్యాంక్‌బండ్‌పై కళామతల్లికి, తెలుగుజాతికి సేవలు చేసిన వారి విగ్రహాలను ప్రతిష్ఠించారన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి తెలుగుబిడ్డపైనా ఉందన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాశరథి రంగాచార్య, కాళోజీ, డాక్టర్ సి నారాయణ రెడ్డి పేర్ల మీద అవార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు జి యాదగిరిరావు, నాగునాగేష్, రాజు, ప్రకాష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పిసాయిబాబా, కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు


జిమ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ రహమత్‌బాగ్ సమోసా పార్కులో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. బుధవారం ఓపెన్ జిమ్ ఏర్పాటు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్నయువత అభిప్రాయాలకు అనుగుణంగా ఈ జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఆమె చెప్పారు. ఓపెన్ జిమ్‌లో అన్ని పరికరాలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, శ్రీకాంత్, నిఖిల్, భీంరాజ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు

చండీగఢ్ తీర్పు బీజేపీకి చెంపపెట్టు

కవాడిగూడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చండీగడ్ మేయర్‌గా ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి కుల్‌దీప్‌కుమార్ విజేతగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంప పెట్టులాంటిదని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కూని చేసేందుకు బీజేపీ చేసిన కుట్రలను దేశ అత్యున్నత న్యాయస్థానం ఎండగట్టిందన్నారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దుర్మార్గపు చర్యల వల్ల సుప్రీంకోర్టు గదిలో మేయర్ ఎన్నికల ఓట్లు లెక్కింపు జరగడం సిగ్గుచేటన్నారు.



తీర్పుపై సంబరాలు చేసుకుంటున్న దిడ్డి సుధాకర్ తదితరులు


డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రవిచారి

సూర్యనగర్ సమగ్రాభివృద్ధికి కృషి

రాంనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని సూర్యనగర్ సమగ్రాభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. బుధవారం సూర్యనగర్‌లో రూ.12 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ పనులను కార్పొరేటర్ కె.రవిచారితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు బస్తీలో పాదయాత్ర నిర్వహించి ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సూర్యనగర్‌లో పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ లేనికారణంగా కొంత కాలంగా ప్రజలు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ప్రస్తుతం నిర్మిస్తున్న నూతన పైప్ లైన్‌తో డ్రైనేజీ సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుందని తెలిపారు. కార్పొరేటర్ రవిచారి మాట్లాడుతూ.. సూర్యనగర్‌లో డ్రైనేజీ, మంచినీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ముచ్చుకుర్తి ప్రభాకర్, ఆర్ మోజెస్, శంకర్‌ముదిరాజ్, కేశపురం అరుణ్, ఎర్రం శేఖర్, బీజేపీ నాయకులు కార్యకర్తలు బస్తీవాసులు పాల్గొన్నారు.


జైస్వాల్‌గార్డెన్ కాలనీ ముఖద్వారం పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

జైస్వాల్‌గార్డెన్ కాలనీని అభివృద్ధి చేస్తా

గోల్నాక, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్‌లోని జైస్వాల్‌గార్డెన్ కాలనీని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్ కాలనీ ముఖద్వారం నిర్మాణం పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం కాలనీలో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ. రాజకీయాలకతీతంగా కాలనీ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చి పనిచేస్తున్నట్టు తెలిపారు. ముఖద్వారం నిర్మాణం దాతలైన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఎ.రామాగౌడ్, శ్రీమైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్, ప్రముఖన్యాయవాది జి.ప్రసన్నాంజనేయులును ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్, శ్రీమైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎన్.రమేష్‌గౌడ్, సి.యాదవరెడ్డి, బి.మధుసూదన్‌చారి, స్థానికులు, అధికారులు పాల్గొన్నారు.

- తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన వీరాబాయి, సయ్యద్ హీజిలు ఎమ్మెల్యేను ఆయననివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కాచిగూడ ఏసీపీగా రఘు


రఘు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు మండలం పరిధిలోని కాచిగూడ డివిజన్ ఏసీపీగా వెగ్గలం రఘు బుధవారం బాధ్యతలు చేపట్టారు. 1995 బ్యాచ్‌కు చెందిన రఘు ఇంటలిజెన్స్ విభాగంలో ఏసీపీగా విధులు నిర్వహించి ప్రస్తుతం కాచిగూడ ఏసీపీగా బదిలీ అయ్యారు. ఇక్కడి పని చేసిన ఏసీపీ కస్తూరి శ్రీనివాస్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ రఘు మాట్లాడుతూ.. కాచిగూడ, అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు తెలిపారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెడతామని ఆయన తెలిపారు.


మేరీ మాదిగకు నియామకపత్రం అందజేస్తున్న వంగపల్లి

ఎమ్మార్పీఎస్ మాదిగ మహిళా రాష్ట్ర కమిటీ ఎన్నిక

రాంనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర కమిటీని బుధవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ప్రకటించారు, అధ్యక్షురాలిగా పాలడుగు మేరీమాదిగ, ఉపాధ్యక్షురాలిగా బి.వరలక్ష్మితో పాటు పలువురిని ప్రకటించారు. మహిళా సమాఖ్యను పటిష్టం చేయడానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షురాలు మేరీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, గణేష్, అండాలు, శ్రీనివాస్, వెంకటేష్, వరలక్ష్మి, మహేశ్వరి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి బీసీ యువజన ఉపాధ్యక్షుడిగా కిషోర్‌యాదవ్


కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్న కిషోర్‌యాదవ్

రాంనగర్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం పశ్చిమ గోదావరి జిల్లా బీసీ యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా తానంకి కిషోర్‌యాదవ్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్య బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ప్రకటించి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్‌యాదవ్ మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ సంఘం పటిష్టత కోసం అంకితభావంతో పనిచేసిన తనకు పదవి కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ర్యాగరిషి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గ్రంథాలయోద్యమ సారథి వట్టికోట ఆళ్వారుస్వామి

వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్


స్మారకోపన్యాసంలో వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, వీసీ ప్రొ.కె.సీతారామారావు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతంలో గ్రంథాలయోద్యమాన్ని నడిపించి, ప్రజలను తన అక్షరానికి పదును పెట్టడం ద్వారా చైతన్యపరిచిన గ్రంథాలయోద్యమనాయకుడు వట్టికోట ఆళ్వారుస్వామి అని వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ అన్నారు. తెలంగాణ ప్రజాసాహిత్యకులు, రచయిత, ఉద్యమకర్త వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతిని పురస్కరించుకుని డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బుధవారం స్మారకోపన్యాసం నిర్వహించారు. 'వట్టికోట ఆళ్వార్ స్వామి- గ్రంథాలయోద్యమం' అనే అంశంపై మాట్లాడుతూ తెలంగాణ జాగృతి కోసం తెలంగాణ మట్టిగడ్డపై పోరు విత్తనాలు జల్లి ఉద్యమ సుమాలను పూయించిన సాహిత్య ఉద్యమరైతు వట్టికోట అని అన్నారు. తెలంగాణ భాషకు యాసకు పెద్దపీట వేసిన సాహిత్య మేరు నగధీరుడని కొనియాడారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. కె.సీతారామారావు మాట్లాడుతూ తెలంగాణ సాహితీ సరస్వతి కన్న మరో అక్షరం వట్టికోట అన్నారు. తెలంగాణ ప్రజల జీవితాన్ని పోరాట తత్వాన్ని, సంస్కృతిని నరనరాన జీర్ణించుకుని గ్రంథ పఠనం ద్వారా లోకజ్ఞానం కలుగుతుందని సమాజాన్ని అర్థం చేసుకొని చైతన్యపరచవచ్చని ఊరూరా గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించి ప్రజా చైతన్యానికి బాటలువేసిన ప్రముఖ సాహిత్య దిగ్గజం వట్టికోట అని ఆయన పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ ఏవీఆర్.ఎన్ రెడ్డి, సామాజిక శాస్త్రాల డీన్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, విశ్వవిద్యాలయ లైబ్రరీ ఇన్‌చార్జి డా.ఎన్.రజని, విభాగాల అధిపతులు, డీన్స్, నేతలు పాల్గొన్నారు.

ఒకరితో ఒకలా.. మరొకరితో ఇంకోలా..!

- రిజిస్ట్రేషన్ల శాఖలో ఉన్నతాధికారుల వివక్ష
- గంటల వ్యవధిలోనే మేడ్చల్ డీఐజీగా మధుసూదన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు, అధికారులపై ఐజీ స్థాయి ఉన్నతాధికారులు వివక్ష కనబరుస్తున్నారంటూ ఉద్యోగ సంఘాల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల వివిధ స్థాయిల్లో ఉద్యోగులు, అధికారుల నియామక ఉత్తర్వులను అమలు చేయడంలో వివక్ష కనబరచడమే కాకుండా, ఆయా ఉత్తర్వులను సదరు వ్యక్తులకు అందించడంలోనూ కమిషనర్ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తుండడంపై ఉద్యోగ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ జిల్లా డీఐజీ నియామకంలో అధికారుల వింతవైఖరి గురించి 'ఆరు నెలలు తిరక్కుండానే అదే అర్డర్ శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై రిజిస్ట్రేషన్ వర్గాల్లో తీవ్రంగా చర్చ జరిగింది. ఆయా నియామకాలపై హైకోర్టులో రిట్ పిటీషన్ ముగియకుండానే ప్రభుత్వం ఈనెల 10న (గతేడాది ఇచ్చిన ఉత్తర్వుల మాదిరిగానే) జీఓలు జారీ చేయడాన్ని ఉద్యోగ సంఘాల నేతలు తప్పుపడుతున్నారు. తాజా ఉత్తర్వుల మేరకు మేడ్చల్ డీఐజీగా మధుసూదన్‌రెడ్డికి గంటల వ్యవధిలో ఆర్డర్స్ కమ్యూనికేట్ చేసిన రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ కార్యాలయం అధికారులు.. పది రోజులు దాటినా కరీంనగర్ డీఐజీగా నియమితులైన రవీందర్‌కు ఉత్తర్వులను ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయులందరికీ పెద్దదిక్కుగా ఉం డాల్సిన ఐజీస్థాయి ఉన్నతాధికారి, కొందరిపై ప్రేమ, మరి కొందరిపై వివక్షను చూపడం సమంజసంగా లేదని ఉద్యోగ సంఘాలు వాపోతున్నాయి.

హైడ్రోథెరపీ యూనిట్ నూతన భవనానికి శంకుస్థాపన

బోయినపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ) సికింద్రాబాద్, కర్ణాటక, రాజనంద్గావ్, ఛత్తీస్‌ఘడ్‌లలో హైడ్రోథెరపీ యూనిట్ల నూతన భవనాల నిర్మాణం కోసం కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్ బుధవారం వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ ఈ కేంద్రాలు ప్రారంభమైనప్పటి నుంచి సొంత భవనాలు లేకపోవడంతో ఎక్కువ మంది దివ్యాంగులు లబ్ధి పొందేలేకపోతున్నారని తెలిపారు. దీంతో కర్ణాటకలోని వడ్డినహళ్లి, దావణగెరె, ఛత్తీస్‌ఘడ్‌లోని రాకుర్బేలా, రాజానంద్‌గావ్‌లో భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత కొత్త భవనం 5216.10 చదరపు మీటర్ల విస్తీర్ణంలో మూడు అంతస్తులలో అత్యాధునిక సౌకర్యాలతో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్నామన్నారు. ఎన్ఐఈపీఐడీ, హన్స్ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో సికింద్రాబాద్‌లోని మనోవికాస్ నగర్‌లోని ఎన్ఐఈపీఐడీ ప్రాంగణంలో హైడ్రోథెరపీ కేంద్రాన్ని నిర్మిస్తున్నామని ఆయన వెల్లడించారు.

రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి


సీఎం రేవంత్‌రెడ్డి దంపతులను కలిసిన అనిల్‌కుమార్‌యాదవ్ దంపతులు

రాంనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి సంబంధించిన సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు, నూతనంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తాను రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ధ్రువీకరణ పత్రాన్ని సీఎంకు అందజేసి సన్మానించారు. అనంతరం అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టత కోసం పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం సతీమణి, అనిల్‌కుమార్ యాదవ్ సతీమణి, ఇద్దరు కుమారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు హైదరాబాద్ అథ్లెటిక్స్ ట్రయల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): హైదరాబాద్ జిల్లా అథ్లెటిక్స్ మీట్ ట్రయల్స్‌ను శుక్రవారం నిజాం కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు రాజేష్‌కుమార్ తెలిపారు. బాలబాలికలు, పురుషులు, మహిళలకు విడివిడిగా ఉదయం 6 గంటల నుంచి అండర్-14, 16, 18, 20 విభాగాలోకల ట్రయల్స్‌ను నిర్వహించనున్నామని రాజేష్ చెప్పారు.

ముషీరాబాద్‌లో గంగపుత్ర సంఘం జెండావిష్కరణ


జెండా ఆవిష్కరిస్తున్న అమృత్‌రాజ్ తదితరులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని ముషీరాబాద్ డివిజన్‌లోని గంగపుత్రకాలనీలో ఆలిండియా గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు పూస గోరక్‌నాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గంగపుత్ర సంఘం జెండాను సంఘం అధ్యక్షుడు అమృత్‌రాజ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గంగపుత్రులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీరాములు, మీసాల ప్రసాద్, శ్రీనివాస్, సత్యనారాయణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

- **సీఐకి సన్మానం**



గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో నూతన సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన డి.రాజును సికింద్రాబాద్ గణపతి దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యుడు సింధం శ్రీశైలం, బీఆర్ఎస్ నేతలు ప్రవీణ్, గిరీష్, సాయిలు బుధవారం కలిసి ఘనంగా సత్కరించారు. - కవాడిగూడ, ఆంధ్రజ్యోతి



జాతీయ టీటీలో హితేష్‌కు 3 పతకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): జాతీయ పారా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ ప్లేయర్ డి.హితేష్ మూడు పతకాలు కొల్లగొట్టాడు. ఇండోర్‌లో మూడ్రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో సింగిల్స్‌లో హితేష్ 3-1తో విశ్వ (మహారాష్ట్ర)పై నెగ్గగా, డబుల్స్ హితేష్-కునాల్ జోడీ 3-2తో ప్రసాద్-రవీంద్ర (హరియాణా) ద్వయంపై, మిక్స్‌డ్ డబుల్స్‌లో హితేష్-జేబీ సహనా జోడీ 3-1తో విశ్వ-నతానియా (ఢిల్లీ) ద్వయంపై గెలిపొందింది.

యోగా పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విద్యాసాగర్‌రావు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సైకాలజిస్ట్ డా.హిప్నో పద్మాకమలాకర్ రచించిన యోగా పుస్తకాన్ని మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు బుధవారం ఆవిష్కరించారు. తెలుగు భాషాదినోత్సవం సందర్భగా టూరిజం ప్లాజా హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పద్మాకమలాకర్ రచించిన పుస్తకాన్ని విద్యాసాగర్‌రావు ఆవిష్కరించి ఆమెను సత్కరించారు. రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ జి.స్నేహజ, ఎ.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ల నియామకం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సెంట్రల్ జిల్లా పరిధిలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు కో కన్వీనర్లను నియమించినట్లు పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల వరకు పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నియామకాలు చేపట్టినట్లు ఆయన చెప్పారు. అంబర్‌పేట నియోజవకర్గం కో కన్వీనర్లుగా ఎస్.అరవింద్ కుమార్, అత్తిని మహేష్, కే.శిరీష, నాంపల్లి నియోజకవర్గం కో కన్వీనర్లు ఎం.బాబురావు, శ్రీనివాస్, ఎస్.సుజాత, ఖైరతాబాద్ నుంచి రమేష్, లక్ష్మణ్‌రావు, టి.విజయతులసి, జూబ్లీ హిల్స్ నుంచి చెరక మహేష్, ఎ.శాంతికుమార్, ఎం సుప్రియాగౌడ్‌లను కో కన్వీనర్లుగా నియమించినట్లు ఆయన చెప్పారు.